ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.6

ANDHRAJYOTHY

నల్లగొండ

3

బుధవారం 6 నవంబరు 2024





వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు కేవలం ఒక్క రోజే మిగిలి ఉంది. బుధవారం ఓట్ల నమోదుకు చివరి రోజు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబరు నెలాఖరున షెడ్యూల్‌ను విడుదల చేసింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ):

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు

నేడే ఆఖరు

- సెప్టెంబరు 30 నుంచి ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
- 5వ తేదీ సాయంత్రం వరకు 19,111ఓట్ల నమోదు
- 23న ముసాయిదా జాబితా
- డిసెంబరు 30న తుది జాబితా

సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. కాగా, మంగళవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయ నియోజకవర్గంలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 19,111 ఓట్లు నమోదయ్యాయి. 6వ తేదీన చివరి రోజు కావడంతో ఓట్ల నమోదు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించి, దీనిపై అభ్యంతరాలను డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరిస్తారు. అదే నెల 25 వరకు అభ్యంతరాలు పరిశీలించి, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఇలా ఉంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. గతంలో...

- మిగతా 4వ పేజీలో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే బుధవారం ప్రారంభంకానుంది. 2011 జనాభా లెక్కల తర్వాత, 2014లో రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రమంతా సమగ్ర సర్వే నిర్వహించింది. ఆ వివరాలను గత ప్రభుత్వం ఎక్కడా వెల్లడించలేదు. రాష్ట్రంలో 2011 తర్వాత అధికారికంగా జనాభా లెక్కలు లేకపోవడం, ఆ లెక్కలు సైతం మతాలవారీగా తప్ప కులాలవారీగా లేకపోవడంతో తాజాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కులగణనకు పూనుకుంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



నేటి నుంచి సమగ్ర


కుటుంబ సర్వే

- జిల్లాలో 5లక్షల కుటుంబాలు
- 3,488 మంది ఎన్యూమరేటర్ల నియామకం

బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆ మేరకు తాజాగా సమగ్రసర్వే చేపట్టాలని నిర్ణయించింది. అందుకోసం ప్రత్యేకంగా బీసీ కమిషన్‌ను సైతం నియమించింది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో కులగణనతో పాటు, ఆర్థిక, సామాజిక, రాజకీయ, తదితర అంశాలన్నింటినీ తేల్చేనిమిత్తం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. అందుకోసం ఇప్పటికే జిల్లాల్లో ఎన్యూమరేటర్ల నియామకాలు, శిక్షణలు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ప్రారంభంకానున్న ఈ సర్వే నెలాఖరు వరకు సాగనుంది. ఆ తరువాత సర్వే వివరాలను ఎన్యూమరేటర్లు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

75 అంశాలతో సర్వే

సర్వేలో ఒక్కో కుటుంబానికి సంబంధించి సుమారు 75 అంశాలకు చెందిన వివరాలు నమోదు చేస్తారు. యజమాని, కుటుంబసభ్యులు, ఉద్యోగాలు, మతం, కులం, ఉపకులం, భూముల వివరాలు, ఆధార్ నెంబర్లు, నీటివనరులు, కౌలు రైతులతే వివరాలు, రాజకీయ, సామాజిక హోదా, ఇతర వాహనాలు, ఆస్తులు, విద్యార్హతలు తదితర వివరాలన్నింటినీ నమోదు చేస్తారు. జిల్లాలో ఉపాధ్యాయులకు ఈ బాధ్యతలు అప్పగించడంతో పాటు వారికి శిక్షణ కూడా ఇచ్చారు. దఫదఫాలుగా శిక్షణతో గణనలో లోపాల్లేకుండా చర్యలు తీసుకున్నారు.



3,832 మంది నియామకం

జిల్లాలో 3,964 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేశారు. 3,483 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తారు. మరో 349 మంది ఎన్యూమరేటర్లు రిజర్వ్‌లో ఉన్నారు. 349 మంది సూపర్‌వైజర్లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సర్వేకు అవసరమైన రికార్డులను అందజేశారు.

2011 తర్వాత రెండోసారి

జిల్లాలో 2011లో జనాభా లెక్కల తర్వాత తిరిగి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఒక దఫా ఒకే రోజు సర్వే నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. 2105లో..

- మిగతా 6వ పేజీలో...

నూతన పాలసీకి మిల్లర్లు సహకరించాలి

పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



ఉదయాధిత్య భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ చౌహాన్

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్), ధాన్యం సేకరణలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీకి మిల్లర్లు సహకరించాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లింగ్ పరిశ్రమ బలపడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వల్ల అటు రైతులు, ఇటు ప్రజలు, మిల్లర్లు సంతోషంగా ఉండాలన్నదే ఉద్దేశమన్నారు. అందుకే ప్రభుత్వం సన్నధాన్యానికి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. మిల్లింగ్ చార్జీలను నాలుగింతలు పెంచిందని, కేవలం 10శాతం బ్యాంక్ గ్యారంటీ కోరుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను సాధ్యమైనంత త్వరగా చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలోని 2.80కోట్ల మంది రేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గత ఐదుళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.900కోట్ల ట్రాన్స్‌పోర్టు చార్జీలను కేంద్రం నుంచి మంజూరు చేయించామన్నారు. ఇకపై మిల్లర్లకు వచ్చే ప్రతీ ప్రయోజనాన్ని సకాలంలో అందిస్తామన్నారు. వానాకాలం, యాసంగిలో సీఎంఆర్‌లో జిల్లా ముందు ఉందని, వానాకాలంలో 99శాతం, యాసంగిలో 75శాతం సీఎంఆర్ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇకపై మిల్లర్లు డిఫాల్ట్ అనే పదమే రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ధాన్యం సేకరణ నోడల్ అధికారి అనిత రామచంద్రన్ మాట్లాడుతూ, రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ చేయాలని కోరారు. జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ, సన్నరకం ధాన్యానికి ఓటీఆర్ నిర్ణయించాలని, పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ చార్జీలను వెంటనే విడుదలచేయాలన్నారు. ఒకటి, రెండు టన్నులు సీఎంఆర్ చెల్లించాల్సి ఉన్న 33 మిల్లులను డిఫాల్ట్‌లో పెట్టకుండా వారికి కూడా సీఎంఆర్ కేటాయించాలని కోరారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటీఆర్ సాధ్యం కానీ పక్షంలో ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. అంతకు ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మిల్లర్లు అడిగిన వెంటనే బ్యాంకు గ్యారంటీ వ్యవధి పెంచామని గుర్తుచేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ హరీష్, జేడీ శ్రవణ్, డీఆర్డీవో నాగిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, ఎల్డీఎం శ్రామిక్, జిల్లా సహకారశాఖ అధికారి పత్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పంటనంతా కొనుగోలు చేయాలి : ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు.



కృష్ణానదిలో నీరుండీ
ఎండుతున్న జీవితాలు

- పర్యాటకులు లేక బోసిపోయిన నల్లగొండ జిల్లా వైజాగ్ కాలనీ
- చేపల వేట లేక ఇబ్బందుల్లో మత్స్యకార్మిక కుటుంబాలు

4



ముగిసిన
తిరునక్షత్రోత్సవాలు

- స్వామివారికి తిరువీధుల్లో పురప్పాట్లు సేవ
- శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం
- క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చన
- రామలింగేశ్వరుడికి వైభవంగా నిత్య పూజలు

5

సిమెంటు పరిశ్రమ
రద్దు తరువాతే రావాలి

- అప్పుడే సీఎం అడుగుపెట్టాలి
- పరిశ్రమతో రైతులు సాగును కోల్పోతారు
- ప్రజలకు కాలుష్య ముప్పు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

5



న్యూస్ బాక్స్

వంద శాతం ఫలితాలు సాధించాలి



చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

చిట్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ప్రతీ రోజు డైరీ, పాఠ్య ప్రణాళిక, పీరియడ్ ప్రణాళిక రాయాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా బోధించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి, అంబటి సత్తయ్య, ఉపాధాయులు భిక్షపతి, సరిత, తదితరులు ఉన్నారు.

తేమతో నిమిత్తం లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

- తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తేమతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం వరి, పత్తి పంటలను కొనుగోలుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నార్కట్‌పల్లిలో జరిగిన పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా మద్దతు ధర ప్రకటించాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, జాల యాదమ్మ, కల్లూరి కంఠం, దండు రవి, నన్నేసాహెబ్, యాదగిరిరెడ్డి, గోపాలు, సైదులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



మిర్యాలగూడ రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లిలో కాంగ్రెస్ నేతల నిరసన

మిర్యాలగూడ, వేములపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని పలువురు కాంగ్రెస్ బీసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం మిర్యాలగూడ కాంగ్రెస్ కార్యాలయంలో నోటికి నలుపు రంగు రిబ్బన్లు కట్టుకుని మౌన నిరసన చేశారు. అనంతరం పట్టణంలోని సాగర్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే రఘువీరారెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి సహకారంతో ఎమ్మెల్సీగా గెలిచిన మల్లన్న ఇప్పుడు వారిపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.

కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించి మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మిర్యాలగూడ కౌన్సిలర్ కొమ్మన నాగలక్ష్మి, నాయకులు గుండు నరేందర్, కాకునూరి బసవయ్య, పందిరి కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేములపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగవెల్లి మధు, గంజి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వందేళ్ల పండుగను విజయవంతం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, చండూరు నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల పండుగను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. దేవరకొండ, చండూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 6న వాడవాడలా పార్టీ జెండాలు ఎగురవేసి ప్రదర్శనలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబరు 30న నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకొండలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, అంజయ్యనాయక్, సుదర్శన్‌రెడ్డి, మైనొద్దీన్, రామస్వామి, చండూరులో మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో జాప్యంపై

రైతుల నిరసన

నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లిలో రాస్తారోకో



నీలంనగర్ వద్ద రైతులతో మాట్లాడుతున్న సీసీఐ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాము తెచ్చిన పత్తిని తేమ శాతం పేరిట కొర్రీ పెట్టి కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఈ మేరకు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం నీలంనగర్ వద్ద గల కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తాము సాగుచేసిన పత్తిని సాంబశివ కాటన్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం కొనుగోలు ప్రక్రియ కొనసాగగా, 20మంది రైతులు ట్రాక్టర్లలో తెచ్చిన పత్తిని కొనుగోలు చేయలేదు. దీంతో తేమ ఎక్కువగా ఉందని తాము తెచ్చిన పత్తిని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాటన్ మిల్లు ఎదుట రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు తెచ్చిన పత్తిని ఎలాంటి తేమశాతం చూడకుండా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ధర్నా చేయటంతో సీసీఐ నిర్వాహకులు గంటసేపు కొనుగోళ్ల ప్రక్రియను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ సీసీఐ అధికారులు సుధీర్, దిలీప్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు మిల్లు వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. అనంతరం పత్తి తేమ శాతాన్ని అధికారులు పరిశీలించగా దాదాపు ఒక్కో పత్తి లోడ్‌లో 12శాతం ఉండాల్సిన తేమ 18శాతం పైగానే చూపించింది. యథావిధిగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించారు. ఇటీవల వర్షాలు పడడం, మంచు వల్ల పత్తిలో తేమశాతం ఎక్కువగానే ఉంటుందని, మద్దతు ధర పెంచేలా చూడాలని రైతులు అధికారులను కోరారు. సోమవారం సాయంత్రం ఈ మిల్లుకు సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభం కావడంతో పెద్దసంఖ్యలో రైతులు రాత్రి నుంచే పత్తిని మిల్లుకు తరలించారు.

గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా కార్యకర్తల సేవలు అభినందనీయమని జిల్లా వైద్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మిర్యాలగూడ డివిజన్ ఆశా కార్యకర్తల సమావేశం మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య పథకాలు ప్రజలకు అందేలా చూడాలని, ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారులు వేణుగోపాల్‌రెడ్డి, గీతారెడ్డి, కేసరి, కృష్ణకుమారి, డీటీసీవో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, పద్మ, అరుంధతి, రాజేష్, దుర్గయ్య, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల కేటాయింపు కొలిక్కి : అనితా రామచంద్రన్

నార్కట్‌పల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ కోసం మిల్లుల ట్యాగింగ్ సమస్య కొలిక్కి వచ్చిందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. మంగళవారం మండలంలోని నెమ్మానిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేసి మాట్లాడారు. మిల్లులకు కేటాయింపు పూర్తికావొచ్చిందని, రేపటి నుంచి ఎగుమతులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్నీ బ్యాగులు, లారీల సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, ఏపీఎం శ్రీదేవి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్, తదితరులు ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అనితా రామచంద్రన్

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగుల చవితిని జిల్లా వ్యాప్తంగా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పాలు సమర్పించి మొక్కు చెల్లించి చల్లగా చూడాలని వేడుకున్నారు.



చెంచులకు ఏదీ చేయూత

- అందని ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
- ఆదాయ వనరులు లేక ఇతర ప్రాంతాలకు వలస

5



నీరుండీ.. ఎండుతున్న జీవితాలు

చేపలవి, మత్స్యకార్మికులవి నీటితోనే ముడిపడిన జీవితాలు. నీరుంటేనే మనుగడ. కానీ నాగార్జునసాగర్‌లో నిండుగా నీరుంటే నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ మత్స్యకార్మికులు ఒక్కపూట తినాల్సిందే. ఇక్కడి మత్స్యకారులు కృష్ణా పరివాహక ప్రాంతంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు కృష్ణా పరివాహకంలో చేపల వేట సాగడం లేదు. దీనికి తోడు పర్యాటకుల రాక తగ్గి పూటగడవడమే భారంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరుండీ తమ జీవితాలు ఎండిపోతున్నాయంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-నేరేడుగొమ్ము)



వాడపల్లి గ్రామంలో మరపడవలు కలిగిన 11 మందితో పాటు మరో 30మంది చేపల వేట సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ వృత్తి తప్ప వారికి మరే ఆదాయ మార్గం లేదు. వలలో చిక్కే చేపల విక్రయాలతోనే వారికి భుక్తి. రాత్రీ పగలు వల వేసినా నీటి ప్రవాహ పెరిగి చేపలు పడటంలేదని మత్స్యకార్మికులు వాపోతున్నారు. వలలో చిక్కే ప్రతీ చేపకు డిమాండ్ ఏమీ ఉండదంటున్నారు. వాడపల్లి సమీపంలో ఎక్కువగా రవ్వ, బొమ్మిడాయి, బొచ్చ, చందమామ, బురదమట్టలు దొరుకుతాయని, ఎక్కువగా డిమాండ్ ఉండే కొర్రమీను తక్కువగా చిక్కుతుందని మత్స్య కార్మికులు తెలిపారు. చేపలను స్థానికంగా, మిర్యాలగూడ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. వచ్చే ఆదాయంతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. సాగర్ గేట్లు ఎత్తి భారీ వరద వచ్చే సమయంలో కొన్నిరోజుల పాటు చేపలవేట ఉండదంటున్నారు.ఆ సమయంలో కుటుంబాలను వెళ్లదీయడం ఇబ్బందిగా ఉందంటున్నారు. ప్రభుత్వం తమను సబ్సిడీపై ఆధునిక పడవలను అందజేయడంతో పాటు చేపలను హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను అందించాలంటున్నారు.

కృష్ణమ్మ ఒడిలో పెరిగిన బిడ్డలు వాళ్లు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా, మూసీ సంగమ ప్రాంతంలో చేపలు వేటకు వెళ్తూ జీవిస్తుంటారు. అదే వారి వృత్తి. వరదసమయాల్లో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కృష్ణా నదిలో ఉండే ఈ మత్స్యకారులు చేపలు పడుతూ జీవనోపాధి పొందడంతో పాటు నీటిలో కొట్టుకుపోయే ఎంతో మంది జీవితాలను కాపాడారు. ఇంత చేస్తున్నా వారి జీవితాల్లో మార్పు రావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)

రక్షణలో ముందు వరుస

వాడపల్లిలో కొలువైన మీనాక్షి అగస్త్యేశ్వర-లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ కృష్ణాతీరంలో చేపలు పట్టేందుకు రాత్రీ పగలు తేడాలేకుండా సమయం కుదిరినప్పుడు మత్స్యకార్మికులు వెళ్తుంటారు. దీంతో వారు లేకుండా సంగమ ప్రాంతం కనిపించదు. సంగమ ప్రాంతంకావడంతో శుభ,అశుభకార్యాల కోసం ఇక్కడికి ప్రజలు తరలివస్తుంటారు. పండుగలు, పర్వదినాల్లో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోవడం, నీటిలోపడితే రక్షించడంలో ముందుంటారు. పుష్కరాలతో పాటు వివిధ పర్వదినాల్లో నదీ స్నానానికి వచ్చే భక్తులను ప్రమాదాల బారి నుంచి కాపాడుతున్నారు. ఇప్పటివరకు 100మందికి పైగానే రక్షించారు. అదేస్థాయిలో నీటి మునిగి చనిపోయిన మృతదేహాలను సైతం వెలికి తీశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గత 40 ఏళ్లగా కృష్ణానదిలో చేపలను పడుతూ జీవనం సాగిస్తున్నా. ప్రమాద సమయంలో ఇప్పటివరకు ఎంతో మందిని రక్షించాం. వరదల సమయంలో చేపల వేటకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఆదాయం లేక జీవితం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం మత్స్యకార్మిక కుటుంబాలను ఆదుకోవాలి.

ఎస్‌కే ఇక్బాల్, మత్స్యకార్మికుడు, వాడపల్లి



వైజాగ్‌కాలనీలో చేపలవేటలేక నిరుపయోగంగా ఉన్న బోట్లు

● పర్యాటకులు లేక బోసిపోయిన వైజాగ్‌కాలనీ ● చేపల వేట లేక ఇబ్బందుల్లో మత్స్యకార్మిక కుటుంబాలు

నదీ తీర ప్రాంతాల్లో వైజాగ్‌కాలనీకి వెళ్లేందుకే ఎక్కువగా పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. స్థానికంగా బోటింగ్‌తో పాటు అక్కడ దొరికే చేపల వంటకాలు కూడా పర్యాటకుల నోళ్లను ఊవ్విళ్లూరిస్తుంటాయి. సాయంత్రం వేళ నదీతీరంలో చేపలు తింటూ సరదాగా గడుపుతుంటారు. ఈ క్రమంలో నిత్యం పర్యాటకుల తాకిడితో ఉండే వైజాగ్‌కాలనీ ఇప్పుడు బోసిపోయింది. నీటినిల్వతో బోటింగ్‌ను నిలిపివేశారు.అదేసమయంలో పర్యాటకులు సరదాగా గడిపేందుకు స్థలం లేకుండాపోయింది. పర్యాటకులు పర్యటనలకు రావద్దని పోలీస్‌శాఖ కూడా హెచ్చరికలు జారీ చేయడంతో అటు ఉపాధిగా ఉన్న చేపల వేట లేక, పర్యాటకుల రాక తగ్గి మత్స్యకార్మికులకు ఆదాయం పూర్తిగా పడిపోయిందని, పూటగడవటం కూడా కష్టంగా మారిందంటున్నారు.

ఉపాధి లేక వలసలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పెరిగి చేపల వేట నిలిచింది. చేపలు వరద సమయంలో ఎదురుఈదుతూ వెళ్తాంటాయి. ఈ క్రమంలో వలకు చేపలు పడటం లేదు. ఒక్కో రోజు వలలో రెండు కిలోల చేపలు కూడా చిక్కడం లేదంటున్నారు మత్స్యకార్మికులు. గ్రామంలో 200 కుటుంబాలు చేపల వేటమీదే ఆధారపడి జీవిస్తుంటాయి. ఆగస్టు నుంచి సాగర్‌కు వరద మొదలైందని మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కుటుంబాలు ఉపాధి కోసం వలస వెళ్లాయంటున్నారు. నీటినిల్వ తగ్గే వరకు చేపలు లభ్యమయ్యే పరిస్థితి ఉండదని, అప్పటి వరకు కృష్ణా నదిలో పర్యాటకులను తిప్పడానికి బోట్లకు అనుమతి ఇచ్చి ఆదుకోవాలని మత్స్యకార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.



● పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి



కృష్ణా పరివాహక ప్రాంతంలో పర్యాటకులు తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి. బోట్లకు అనుమతి ఇస్తే పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. దీంతో తమకు జీవనోపాధి కలుగుతుంది. చేపలవేట లేక ఇబ్బందుల్లో ఉన్నాం.

చేపల నిరీక్ష, వైజాగ్‌కాలనీ

● పూటగడవడమే భారమైంది



కృష్ణానదిలో నీటిప్రవాహం పెరిగి వలలు వేసినా చేపలు ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి.రెండు, మూడు కిలోలు కూడా పడడంలేదు. దీంతో పూటగడవడం భారమైంది. పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇస్తే ఉపాధి దొరుకుతుంది.

కోట జగ్గు, మత్స్యకారుడు, వైజాగ్‌కాలనీ.

ఓట్ల నమోదుకు నేడే ఆఖరు

(3వ పేజీ తరువాయి)

ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు సైతం మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈసారి జరిగే ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల ఉపాధ్యాయులకు సైతం ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు ఓట్ల నమోదు కోసం అవగాహనతో పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. దీంతో పాటు పలువురు అభ్యర్థులు ప్రచారం కూడా ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888 ఓట్లు నమోదయ్యాయి. ఇంకా ఓట్ల నమోదుకు మరో రోజు గడువు ఉన్నందున్న వీటి సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మంగళవారం నాటికి
మూడు ఉమ్మడి జిల్లాలో ఓట్ల నమోదు ఇలా...

జిల్లా	మండలాలు	వచ్చిన దరఖాస్తులు
సిద్ధిపేట	04	128
నల్లగొండ	33	3,886
సూర్యాపేట	23	2201
యాదాద్రి	17	874
జనగాం	12	645
మహబూబాబాద్	18	988
వరంగల్	13	1818
హనుమకొండ	11	3664
భూపాలపల్లి	07	196
భద్రాద్రి	23	1496
ఖమ్మం	21	2873
ములుగు	09	342
మొత్తం	191	19,111

8న టెండర్ కం బహిరంగ వేలం

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం ఈనెల 8 తేదీన వివిధ వస్తువుల విక్రయ హక్కుల కల్పించేందుకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాది కాలానికి వివిధవస్తువులకు సంబంధించి వేలం జరుగుతుందని ఆసక్తి గల వారు ఎల్లమ్మ ఆలయం పేరిట ఏదేని జాతీయ బ్యాంకులో డీడీ తీసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. టెండర్‌కు సకాలంలో హాజరుకావాలన్నారు. అదేవిధంగా బుధవారం హుండీకానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోశారు. నల్లగొండలోని పానగల్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నాగదేవత పుట్ట వద్ద మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోశారు. యాదాద్రి జిల్లా, సూర్యాపేట జిల్లాలోని పలు ఆలయాల్లోనూ భక్తుల సందడి కనిపించింది.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)



సూర్యాపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



నల్లగొండలో నాగదేవత విగ్రహానికి పాలుపోస్తున్న మహిళలు





సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలో నాగదేవతల విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు, నల్లగొండ జిల్లా వేములపల్లిలో నాగదేవత విగ్రహంపై పాలుపోస్తున్న భక్తులు

గుట్టను తవ్వి.. దారిని చేసి

● సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర కోసం చకచకా ఏర్పాట్లు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఈ నెల 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సీఎం పాదయాత్ర నేపథ్యంలో మూసీ పరివాహకంలోని సంగెం పరిధిలోని గుట్టను తవ్వి మట్టిని తరలించారు. మూసీ ప్రాంతానికి ఇరువైపులా మట్టిని పోసి చదునుచేశారు. పాదయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.





సీఎం పాదయాత్ర కోసం సంగెం సమీపంలోని గుట్ట వద్ద దారి కోసం ఎక్స్‌కవేటర్‌తో కొనసాగుతున్న తవ్వకాలు

ఎంజీయూ రిజిస్ట్రార్‌గా అల్వాల రవి



నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని అభినందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు అల్వాల రవిని నియమిస్తూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రతీ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి అంకితభావంతో పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మొదటిసారిగా ఎంజీయూ అధ్యాపకుడికి అవకాశం రావడం ఎంతో సంతోషకరమని, సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న దృష్ట్యా మరింత ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని, ప్రిన్సిపాళ్లు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

బోరింగ్‌తండాలో మద్యనిషేధంపై తీర్మానం



గ్రామంలో మద్యనిషేధం విధించుకుంటూ చేసిన తీర్మానాల కాపీలను చూపిస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన తండాలో మద్యం మహమ్మారి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తుందని, అందుకే తమ గ్రామాల్లో మద్యం నిషేధించాలని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో పల్లెలు ఒక్కొక్కటిగా ప్రతినబూనుతున్నాయి. మొన్నటి వరకు మండలంలోని మూడు గ్రామాల్లో మద్యం నిషేధం అమలుకు తీర్మానించగా మంగళవారం బోరింగ్‌తండాలో మద్యపాననిషేధం అమలుకు తీర్మానించారు. వివిధ సామాజిక, రాజకీయ వర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో సమావేశమయ్యారు. గ్రామంలో మద్యం దుకాణాలు మూసివేయాలని అఖిలపక్షాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక నుంచి మద్యం విక్రయించడం, తాగడం చేయవద్దంటూ ప్రతిజ్ఞ చేశారు. బోరింగ్‌తండాలో మద్యం విక్రయించినా, తాగినా జరిమానా విధిస్తామని, ప్రతీ రాజకీయ పార్టీల కులసంఘాలు, యువజన సంఘాల నుంచి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. గ్రామాల్లో మద్యనిషేధం చేసుకోవడం సంతోషకరమైన శాంతియుతంగా ఉద్యమాలు చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. కిరాణాషాపులు మరే విధమైన ప్రాంతాల్లో గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుగులోతు గణేష్, చాంప్లా, కుమార్, సురేందర్, శ్రీనివాస్, శేఖర్, వీరన్న, ప్రేమ్‌కుమార్, నందు, పార్వతీ, పద్మ, బుజ్జి, చంద్రకళ, కల్పన, మంజుల పాల్గొన్నారు.



కనగల్‌లో కొనసాగుతున్న బాలుర విభాగంలో పోటీ

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖోఖో సెలక్షన్ పోటీలు

● 24 మంది బాల, బాలికల ఎంపిక

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-19 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. బాలుర విభాగంలో 120 మంది, బాలికల విభాగంలో 130 మంది పాల్గొనగా, 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 8, 9, 10 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్ల నుంచి పాల్గొననున్నారు. అంతకుముందు పోటీలను డీఐఈవో దస్రూనాయక్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ థామస్, మమత, పీడీలు నర్సిరెడ్డి, విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు రాజు, భద్రయ్య, జగదీష్, అక్కినేపల్లి శ్రీనివాస్, రాజేందర్, సుమధుర గ్రూప్స్ ప్రతినిధి నర్సింగ్ మురళీగౌడ్, బొడ్డుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దస్రూనాయక్

రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్



నల్లగొండ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన తడక కిరణ్‌ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలోని రాధా కృష్ణా స్టేడియంలో నిర్వహించే 14వ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 31 హాకీ జట్లు పాల్గొంటున్నాయి. రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్ ఉండనున్నారు. ప్రస్తుతం ఆయన ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ హాకీ టీం కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మాసాయిపేట విద్యార్థిని



విద్యార్థిని హిందును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యాదగిరిగుట్టరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట విద్యార్థిని వల్లపు హిందు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా జట్టు తరుపున హిందు ఈ నెల 7వ తేదీ నుంచి తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో నిర్వహించే అండర్-14 పోటీల్లో పాల్గొననున్నట్లు మాసాయిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మల్లికార్జున్ తెలిపారు. ఆయనతో పాటు పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం హిందును అభినందించింది.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 5: విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించాడు. సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని రాంపురంతండాలో ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు ఉపాధ్యా యుడిపై మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. ఎంఈవో గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మామిళ్లగూడెం గ్రామానికి చెందిన నవిలే ఉపేందర్ రాంపురంతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్య మృతి చెందినప్పటి నుంచీ నిత్యం మద్యం మత్తులో పాఠశాలకు వస్తుండడంతో రెండేళ్ల క్రితం ఇదే తండావాసులు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. అప్పుడు సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయుడు ఆరు నెలల క్రితం విధుల్లో చేరారు. సోమవారం కూడా మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించటంతో గ్రామస్థులు జిల్లా విద్యాశాఖ అధికారికి ఆ ఫొటోలను పంపి ంచారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం గ్రామస్థులు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడితండాలో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన తేజావత్ సాయిభగవాన్ (24) కోదాడ పట్టణంలోని ఓ పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో తను పనిచేసే దుకాణం వద్దకు బాలాజీనగర్‌కు చెందిన పవన్, నందూలాల్, సిద్ధు, నవీన్, కూచిపూడితండాకు చెందిన సాయి, ఇంకా కొంతమంది వచ్చి పవన్ చెల్లెల్ని ప్రేమ పేరుతో వేధిస్తున్నావని ఆ విషయంలో మాట్లాడుదామని పిలిపించారని ఎస్‌ఐ తెలిపారు. సాయి భగవాన్, అతని స్నేహితుడు ప్రకాశ్ ఒకే బండిపై కోదాడలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే పైవారందరూ సాయి భగవాన్‌పై దాడి చేశారు. దీంతో సాయిభగవాన్ కూచిపూడితండాకు వచ్చి అవమానభారంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతనిని కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. సాయిభగవాన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై వ్యక్తి దాడి



చికిత్స పొందుతున్న అసిస్టెంట్ లైన్‌మన్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లిలో జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసిస్టెంట్ లైన్‌మెన్ గుగులోతు వెంకటేష్ జగత్‌పల్లి గ్రామంలో మంగళవారం కరెంటు మీటర్ రీడింగ్ చేస్తున్నాడు. గ్రామంలోని బింగి ఈశ్వర్ ఇంటికి మీటర్ రీడింగ్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి ముందున్న కుక్క తనని కరవడానికి రాగా, తన వద్ద ఉన్న కటింగ్ ప్లేయర్‌తో కుక్కను కొట్టడంతో అది అరుస్తూ ఇంట్లోకి వెళ్లింది. తన కుక్కను కొట్టావని అయితే ఇంటి యజమాని ఈశ్వర్ ఆగ్రహంతో దాడి చేశాడని అసిస్టెంట్ లైన్‌మెన్ బోరున విలపించాడు. అంతేగాక తనను కులం పేరుతో దూషించాడని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తన సహచర సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.


మహిళ గొంతుకోసిన గుర్తుతెలియని వ్యక్తి

కోదాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మహిళపై దాడి చేసి గొంతు గోసి పరారయ్యాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసంటున్న ఎస్. రేణుక ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి మహిళను గొంతుకోశారు. దీంతో ఆమె అరుపులు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. గాయపడిన రేణుకను స్థానికులు నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు

మేళ్లచెర్వు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రానికి ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా చేస్తూ 250 గ్రాముల గంజాయితో ఈ నెల 2వ తేదీన సింహాద్రి, నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మండల కేంద్రానికి చెందిన యామపంగు మహేష్, మంగలపల్లి సింహాద్రి, బుస్కా నరేష్‌లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం

నాగారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో మంగళవారం జరిగింది. ఆకుల నాగయ్య వ్యవసాయ క్షేత్రంలో కాడెద్దులను మేపుతుండగా మేతకోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఎద్దు విలువ సూమారు రూ.50 వేలు ఉంటుందని రైతు నాగయ్య తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన మస్కు వెంకటయ్య(35) కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఊరు చివరన గల బత్తాయి తోటలో గల మామిడి చెట్టుకు ఉరి వేసుకొని విగతజీవిగా వేలాడూ ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం బత్తాయి తోట యాజమాని తిలారి వెంకటమ్మ తోట వద్దకు వెళ్లింది. అక్కడ చెట్టుకు వేలాడూ వ్యక్తి కనిపించడంతో భయపడిన ఆమె వెంటనే గ్రామంలోకి పరుగెత్తుకు వచ్చి గ్రామస్థులకు విషయం చెప్పింది. వారు వెంటనే వెళ్లి చూసి గుడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటయ్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సెంట్రింగ్ పనికి వెళ్లి..

నల్లగొండ, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలో నివాసముంటున్న పొనుగోటి నాగేశ్వర్‌రావ్(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో షంషానగర్‌లో నివాసం ఉంటున్నాడు. తిప్పర్తి డిప్యూటీ తహసీల్దార్ కొత్త ఇంట్లో పనిచేస్తూ కింద పడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. నాగేశ్వరరావు సోదరుడు వెంకటేశ్వరావ్ ఫిర్యాదు మేరరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెంచులకు ఏదీ చేయూత

స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడిచినా చెంచుకుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావడం లేదు. ఇంకా సాంప్రదాయ వృత్తులే ఆదాయ వనరులుగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి, వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయంతోనే కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెంచులను నాలుగు దశాబ్దాల కిందటే గుర్తించి ప్రభుత్వం అరకొర సౌకర్యాలు కల్పించి చేతులు దులుపుకుంది. .

(ఆంధ్రజ్యోతి-డిండి)



గోనబోయినపల్లిలో ఒకే ఇంట్లో నివాసముంటున్న జెల్ల గురువయ్య కుటుంబం

నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న చెంచులను గుర్తించి, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని 1986లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో మామిళ్లగడ్డ వద్ద అటవీ ప్రాంతానికి సమీపంలో జీవిస్తున్న 17చెంచు కుటుంబాలను గుర్తించింది. అటవీ ఉత్పత్తులతోనే కుటుంబాలను పోషించుకుంటున్న వారిని చేరదీసి డిండి మండలం గోనబోయినపల్లిలో పునరావాసం కల్పించింది. గ్రామంలోని సర్వే నెంబర్ 743, 745లోని వ్యవసాయ భూమిని ప్రతీ కుటుంబానికి 1.20 ఎకరాల చొప్పున కేటాయించింది. అయితే నీటి సౌకర్యం లేని ఈ భూమిని సాగు చేయలేక చెంచులు బీడుగా ఉంచారు. ఇదిలా ఉండగా భూములకు సంబంధించిన పట్టాలను మాత్రం వారి పేరు మీద చేయలేదు. కలెక్టర్ పేరు మీదనే పట్టాలను పంపిణీ చేసింది. అదేవిధంగా 1988లో 17 కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించి పంపిణీ చేసింది.

ఇతర ప్రాంతాలకు వలస

చెంచులు అటవీలో లభించే ఉత్పత్తులతోనే ఆదాయాన్ని పొందే వారు. కుందేళ్లను పట్టడం, రోకళ్ల తయారు చేయడం, కుంకుడుకాయలు సేకరించడం, నాగళ్లకు ఉపయోగించే కోలలు తయారు చేసి వాటిని సమీపంలోని గ్రామంలో విక్రయించి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేవారు. గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి నీటిసౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. కొందరు చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామానికి కొందరు వలసలు పోగా మరికొందరు అక్కడక్కడ నివాసం ఉంటున్నారు. చెంచులలో ఒకరైన జెల్ల గురువయ్యకు ఆరుగురు కొడుకులు ఉన్నారు. అందులో నలుగురు వివాహాలు అయ్యాయి. కుటుంబం మొత్తం 20 మందికిపైగా ఉన్నారు. వీరంతా ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఇలా కుటుంబాల సంఖ్య పెరగడంతో ఇళ్లు సరిపోకపోవడం వంటి కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో వారికి కేటాయించిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని చెంచులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా సాగులోకి భూములు

గత పదేళ్లలో కొన్ని సమయాల్లో వర్షాలు అధికంగా కురవడంతో గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి ఎత్తున ఉన్న కానుగచెరువు అలుగు పోస్తోంది. కానుగ చెరువు అలుగుపోసినప్పుడు మాత్రమే కాల్వకు నీరుచేరి పొలాలకు అందుతుంది. చెరువులో నీళ్లు తగ్గితే పంటచేలకు నీరందక ఎండిపోవాల్సిందేనని వారు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూములకు విద్యుత్ ఏర్పాటు చేసి బోరు బావులు తోడించాలని వారు కోరుతున్నారు. సాగు చేయని సమయంలో జీవనోపాధి కోసం చేపల వేట, కుంకుడుకాయల సేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలోనే గురువయ్య ఆయన భార్య నిరంజమ్మ, ఇద్దరు కుమారులు, కోడళ్లు నాలుగు నెలల పసికందును తీసుకొని చేపలవేటకు డిండి వాగులోకి వెళ్లి సెప్టెంబరు నెలలో నీటిలో చిక్కుకున్నారు.

ఇళ్లులేక అందరం ఒకే ఇంట్లో ఉంటున్నాం



నాకు ఆరుగురు కుమారులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో కలిపి 20 మంది ఉన్నాం. అందరం చిన్నఇంట్లోనే ఉంటున్నాం. ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలి. రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. ● జెల్ల గురువయ్య.

అందని సంక్షేమ ఫలాలు

చెంచులకు కేటాయించిన వ్యవసాయ భూమి కలెక్టర్ పేరున నమోదై ఉంది. దీంతో ఇటీవలి ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్నారు. కుటుంబాల సంఖ్య పెరిగినా ప్రభుత్వం పక్కా గృహాలు కల్పించలేదు. కొందరు శిథిలావస్థకు చేరిన గృహాలను మరమ్మతు చేసుకుని ఉంటుండగా, మరికొందరు కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. గ్రామంలోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నా చెంచుల పిల్లల్లో ఎవరూ చదువుపై ఆసక్తి చూపడంలేదు. వారిని కుటుంబ సభ్యులు తమ వెంటే పనులకు తీసుకెళ్తున్నారు. 17 కుటుంబాలు ఉన్న చెంచులు ప్రస్తుతం 40 కుటుంబాలకు చేరగా వారి జనాభా 120కి పైగా ఉంది. అయినప్పటికీ వీరి కుటుంబాలలో 10వ తరగతి పూర్తిచేసినవారు ఒక్కరూ లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా వీరికి రేషన్‌కార్డులు జారీకాకపోవడంతో చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యం కూడా అందడంలేదు. చెంచులు సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	260
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.60
టీఎంసీలు	303.4310
ఎడమకాల్వకు నీటి విడుదల	5,018
కుడికాల్వకు	9,443
విద్యుత్ కేంద్రం ద్వారా	25,291
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	41,352 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	9,30 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.65 అడుగులు
టీఎంసీలు	4.11
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	738.46 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	887.95 క్యూసెక్కులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● *పోలీసులు సకాలంలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగింత*

నాగార్జునసాగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు రెండు గంటల్లోగా ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం తునికినూతుల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రమావత్ తిరుపతమ్మ(32) మంగళవారం భర్తతో గొడవ పడి నాగార్జునసాగర్‌కు వచ్చింది. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ కొత్త బ్రిడ్జి వద్దకు వెళ్లి ఉంటుందనే అనుమానంతో భర్త లక్పతి వెంటనే నాగార్జునసాగర్‌కు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం(జీపీఎస్) సాయంతో మహిళ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆమె ఉన్న ప్రాంతాన్ని తెలుసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి, హోంగార్డులు సతీష్, రవికునాయక్ అక్కడికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి తన భార్యను కాపాడిన పోలీసులకు లక్పతి కృతజ్ఞతలు తెలిపాడు.

మాధవరంలో కారు బీభత్సం.. ఒకరు మృతి

మునగాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త నిద్రమత్తుతో కారు నడపడంతో బైక్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామశివారులో మంగళవారం జరిగింది. మాధవరం గ్రామానికి చెందిన నలగొండ పిచ్చమ్మ(48), ఆమె కుమారుడు నలగొండ నవీన్ (బీటెక్ విద్యార్థి) టీవీఎస్ బైక్‌పై పొలానికి మందు కొట్టేందుకు వెళ్తున్నారు. అదే క్రమంలో ఎల్లాల వెంకన్న, కుమారుడు సతీష్, మన్యం లింగయ్య నడుచుకుంటూ టీవీఎస్‌పై వెళ్తున్న వారితో మాట్లాడుకుంటూ రోడ్డు పక్కనుంచి వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో టీవీఎస్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై ఉన్న నలగొండ పిచ్చమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్‌లో సూర్యాపేటలోని ఏరియా ఆస్పతికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పిచ్చమ్మ చికిత్సపొందుతూ మృతిచెందింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ చిట్యాల వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఒంటరితనం భరించలేక..

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాతకోటి సైదులు (55) ఆలగడప చేపల చెరువు వద్ద కాపలా కూలీగా పనిచేస్తున్నాడు. అడపాదడపా లక్ష్మీపురానికి వస్తుంటాడు. మంగళవారం ఉదయం గ్రామంలోని రామాలయం వద్ద పురుగుల మందు సేవిస్తూ ఉండడాన్ని గుర్తించిన స్థానికులు సైదులును నిలువరించారు. వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సైదులు భార్య 20 సంవత్సరాల క్రితం చనిపోగా, చిన్న కుమారుడు మూడేళ్ల కిందట చనిపోయాడు.

ఒంటరితనంతో బాధప డుతూ మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు గ్రామస్థులు తెలిపారు. పెద్ద కుమారుడు యేలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పొలానికి వెళుతూ నీటిలో మునిగి రైతు మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొలానికి బయలుదేరిన రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడ్డోనితండాకు చెందిన నేనావత్ నరియానాయక్(52)కు గ్రామ శివారులోని మర్రిచెట్టు తండా (మైనంపల్లి వాగు పక్కన) వ్యవసాయ భూమి ఉంది. పొలం పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటినుంచి బయలుదేరాడు. మర్రిచెట్టు తండా వైపు వెళ్లేవారు వాగు పక్కగా ఉన్న డొంక మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు మైనంపల్లి వాగు నిండి డొంక మార్గంలోకి నీరు చేరింది. అటుగా వెళుతున్న నరియానాయక్ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. కొద్ది దూరం కొట్టుకుపోయి విగతజీవిగా పడి ఉన్న నరి యానాయక్‌ను గుర్తించిన పరిసర ప్రాంత రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. నరియానాయక్ మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నరియానాయక్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుడ్డోనితండాకు వెళ్లి నరియానాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ముగిసిన తిరునక్షత్రోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి, ఆళ్వారులను మాడవీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మనవాళ మహాముని తిరున క్షత్రోత్సవాలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మం గళవారం స్వామివారు, ఆళ్వారులకు తిరువీధిలో పుణప్పాట్టు సేవ అర్చకులు చేపట్టి ప్రబంధ పాశురాలను పఠిస్తూ మాడవీధుల్లో ఊరే గించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థాన అర్చకులు, పండితులు, ప్రబంధ పారాయణదారులు, ఆలయ అనువంశిక ధర్మకర్త పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేద మంత్ర పఠనాలతో పంచామృ తాభిషేకం చేసిన అర్చకులు 1001 తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామ లింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాత గుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 14,42,089ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

సిమెంట్ పరిశ్రమ రద్దు చేయించిన తర్వాతే

సీఎం జిల్లాలో అడుగుపెట్టాలి

● *నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య*



పెద్దకాపర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కాలుష్యంతో హాని కలిగించేలా రామన్నపేట శివారులో ఏర్పాటు చేసే సిమెంట్ పరిశ్రమను రద్దు చేయించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమ వల్ల ఆయా ప్రాంతాల్లో విపరీతమైన కాలుష్యం వెదజల్లుతుందని ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు వేలాది మంది రైతులు పరిశ్రమతో వ్యవసాయ సాగును కోల్పోతారని, భూముల విలువ కూడా తగ్గుతుందని భూములున్న వారు పెద్దఎత్తున నష్టపోతారన్నారు. ప్రజాకాంక్ష మేరకు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ కోసం ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో పాదయాత్ర చేపట్టి పర్యటించనున్నారని సిమెంటు పరిశ్రమను రద్దు చేయించాకే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను మరిచారని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రామన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటు చేయబోయే కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేసినట్లు ప్రకటించిన తర్వాతనే యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలంకారంగా ప్రారంభించారు. తప్పా ఇప్పటి వరకు కొనుగోలు జరగడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి చేటుగా మారనున్న సిమెంట్ ఫ్యాక్టరీని కూడా రద్దు చేయాలని అన్నారు. లేని పక్షంలో సీఎం మూసీ యాత్రను అడ్డుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

సూర్యాపేటరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యు వకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం ద్వారకుంట గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్, శివవరప్రసాద్ కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం సమీపంలోకి రాగానే ధాన్యం లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. యువకులకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

CLASSIFIEDS

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

CHANGE OF NAME

★ I, MOHAMMED QAYYUM S/o MOHAMMED JAN, R/o. H.No. 4-10-600, Abbasiya Colony, DVK Road, Nalgonda (T&D), TS, have changed my name from MOHAMMED QAYYUM S/o. MOHAMMED JAN to MOHAMMED ABDUL QAYYUM S/o. MOHAMMED JHAN for all purpose

AJY_223772

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413365 9985413656

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో బాలు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో మంగళవారం కెరియర్ గైడెన్స్‌పై మంగళవారంసెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో బాలు హాజరై మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఇష్టంతో చదవాలని సూచించారు. అనంతరం గతేడాది పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీవీకే రామన్, ప్రిన్సిపాల్ జయరాజన్, విద్యావేత్తలు సుజయ్‌కుమార్, గూడూరు శ్రీనివాసరావు, చెన్నూరి రవికుమార్, విద్యార్థులు పేరెంట్స్ పాల్గొన్నారు.

జల వనరులను కాపాడుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రేవతి

చిట్యాల, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి) : జల వనరులను కాపాడి భావి తరాలకు అందించాలని జిల్లా భూగర్భ జల శాఖాధికారి రేవతి కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో భూగర్భ జలశాఖ, ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జల వనరుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నామ కుమార్, మానస, లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, సొసైటీ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



ఎల్‌ఈడీ లైట్లు అందజేస్తున్న సంజయ్‌దాస్

చిట్యాల, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కమిషనర్ వీరేందర్ కోరారు. చిట్యాలలో వీధి లైట్ల కోసం మంగళవారం బీజేపీ నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ రూ. 12 వేల విలువైన ఎల్‌ఈడీ లైట్లను అందజేశారు. బీజేపీ నాయకులు బొడిగె అశోక్, గుండాల నరేష్‌గౌడ్, దేవేందర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

రామగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):మునిసిపల్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట జరుగుతున్న రిలే దీక్ష మంగళవారం నాటికి రెండో రోజు కొనసాగింది. ఈ శిబిరానికి భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలపై పాలకవర్గం స్పందించకపోతే ఈనెల 12 నుంచి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, నాయకులు దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహా, కోట్ల అశోక్ రెడ్డి, వెంకటేశం,పద్మ, నక్క సత్తయ్య, సంద భాగ్యమ్మ, సావిత్రిమ్మ ఉన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ



సర్వేపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వేపై మునిసిపల్ కార్యాలయంలో ఉద్యోగులకు శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎండీ. యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో కుటుంబాల వివరాలను సేకరించాలన్నారు. ట్రైనర్ ప్రవీణ్ సర్వే సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలు, అధికారులు వెంకటరమణ, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

బీసీ కమిషన్ ఏర్పాటు అభినందనీయం

మాడ్గులపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో బీసీ రిజర్వేషన్లకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా కమిటీ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో కుంటి గొర్ల కోటేష్‌యాదవ్, సైదులు, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

మేథోమదన సదస్సుకు తరలిన నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన మేధోమదన సదస్సుకు బీసీ సంఘాల నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, నాయకులు దుండిగాల వెంకటేశ్వర్లు, ఆర్. ప్రసన్న, వెంకటేష్, నాగేశ్వరరావు, నాగయ్య ఉన్నారు.

మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు



దివ్యాంగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లగొండ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం కామినేని మెడికల్ కాలేజీ సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. కామినేని వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, సీడీపీవో నిర్మల, వన్ టౌన్ ఎస్‌ఐ శంకర్, సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు శైలజ, వరలక్ష్మి వైద్యులు డాక్టర్ వర్ధిని, డాక్టర్ దివ్య శ్రీముఖి, పీర్వో కిరణ్ పాల్గొన్నారు.

బ్లాక్‌స్పాట్ వద్ద సర్వీసు రోడ్లు



హైదరాబాద్-విజయవాడ మధ్య ప్రధాన రహదారిగా ఉన్న 65వ నంబరు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఎన్‌హెచ్‌ఏఐ (జాతీయ రహదారుల నియంత్రణ సంస్థ) ఇటీవల బ్లాక్ స్పాట్లుగా గుర్తించింది. అయితే ఆ సంస్థ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. ఇందు లో భాగంగా కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం వద్ద బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన ప్రాంతంలో సర్వీసు రోడ్ల నిర్మాణానికి ఆమోదం దక్కింది. ఇనుపాముల బస్‌స్టేజీ వద్ద నిర్మించిన అండర్ పాసింగ్ వంతెన నుంచి విజయవాడ వైపునకు వంద మీటర్ల మేర గతంలో నిర్మించిన కొద్దిపాటి సర్వీసు రోడ్డు నుంచి ప్రారంభమై గ్రామ శివారులోని మల్లన్నగుట్ట వరకు హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లను నూతనంగా నిర్మించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి, కేతేపల్లి)

- ముమ్మరంగా సాగుతున్న పనులు
- హైవేకు ఇరువైపులా రహదారుల నిర్మాణం

పన్నెండేళ్లుగా ఇబ్బందులు

విజయవాడ వైపు వెళ్లే మార్గంలో మల్లన్నగుట్ట వద్ద గల యూటర్న్ జంక్షన్ వరకు సర్వీసు రోడ్డు లేక గ్రామం నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, పశువులతో రైతులు, పశువులు, గొర్రెలు, మేకల కాపరులు దశాబ్దానికి పైగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో మల్లన్నగుట్ట వద్ద గల వడ్డెర కాలనీవాసులు నిత్యావసరాల కొనుగోలుకై ఇనుపాముల గ్రామంలోకి రాకపోకలు సాగించడానికి నిత్యం ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సర్వీసు రోడ్డు లేకపోవడంతో పన్నెండేళ్లుగా ఇనుపాముల గ్రామస్థులతో పాటు పలువురు వాహనదారులు హైవేపై రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలబారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

ఈ క్రమంలో ప్రస్తుతం విజయవాడ వైపు వెళ్లే మార్గానికి కుడి వైపున మల్లన్నగుట్ట వరకు, ఎడమ వైపున హెచ్‌పీ పెట్రోల్ బంకు వరకు సర్వీసు రోడ్ల నిర్మాణం జరగనుంది. 18అడుగుల వెడల్పు 1.2 కి.మీ. పొడవుతో నిర్మించే ఈ సర్వీసు రోడ్ల వెంట లైటింగ్, డ్రైనేజీ ఏర్పాటు చేయనున్నారు. ఈ సర్వీసు రోడ్ల నిర్మాణ పనులు పూర్తయితే ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడనుంది.

రూ.6 కోట్లు మంజూరు

ఎన్‌హెచ్‌ఏఐ కేతేపల్లి సర్వీస్ రోడ్ల కోసం రూ.6కోట్లు మంజూరు చేసింది. ఈ పనుల నిర్వహణకు టెండర్లు దక్కించుకున్న హర్యానాకు చెందిన ఆర్‌కేసీ సంస్థ కొద్ది రోజుల క్రితం పనులను ప్రారంభించింది. నెల రోజులుగా హైవేకు ఇరువైపులా మల్లన్నగుట్ట వరకు గల కంప చెట్లు, బండరాళ్లను తొలగించి గుంతలమయంగా ఉన్న మట్టిరోడ్డును యంత్రాల సాయంతో చదును చేసి సర్వీసు రోడ్ల నిర్మాణానికి స్థలాన్ని అనువుగా మార్చారు.

1.2 కిలో మీటర్ల మేర సర్వీసు రోడ్ల నిర్మాణం

నాటి 9వ నంబ రు జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించిన నాడు ఇనుపాముల గ్రామ శివారులోని మల్లన్నగుట్ట వద్ద యూటర్న్ జంక్షన్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత బస్‌స్టేజీ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించాక అండర్ పాస్ నుంచి హైవేకు ఇరువైపులా వంద మీటర్ల మేర మాత్రమే సర్వీసు రోడ్లు నిర్మించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

- ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసు కోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ కోరారు. నియోజకవర్గంలోని 68 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి రూ.17లక్షల చెక్కులను మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాన్ యాదవ్, అరుణాసురేష్‌గౌడ్, లచ్చిరాంనాయక్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, యుగేందర్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, రాంసింగ్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులు కల్పించాలి

మండలంలోని పెంచికల్‌పహడ్ వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇళ్ల లబ్ధిదారులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలూనాయక్‌కు విన్నవించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే విద్యుత్, మిషన్‌భగీరథ, పంచాయతీరాజ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లబ్ధిదారులు వెంకటయ్య, అరుణ, లక్ష్మయ్య, యాదగిరి, మంగమ్మ, ఇరగదిండ్ల సైదమ్మ, భారతమ్మ, హుస్సేన్‌బి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా పనిచేస్తా



శాలిగౌరారం: వల్లాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

శాలిగౌరారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలతోపేతమే ధ్యేయంగా పనిచే స్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యుడిగా ఐదున్నర ఏండ్లుగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాలలను (కెజీబీవీ), వివిధ యజమాన్యాలు నిర్వహిస్తున్న పాఠశాలల సమస్యల పరిష్కా రానికి ఎన్నో పోరాటాలు నిర్వహించానన్నారు. ఐదేళ్లలో ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించకుండా పని చేశానని, తనను ఓటు వేసి గెలిపిస్తే మీ వాడిగా పనిచేస్తానని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం టీఎస్‌యూటీఎఫ్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, శాలిగౌరారం మండలాధ్యక్షుడు రాగి రాకేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కడేరు రవికుమార్, పాల్గొన్నారు.

- చిట్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వట్టిమర్తిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతుగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎమెల్సీగా నర్సిరెడ్డి మరో సారి గెలిపించాలని కోరారు. ఏళమల్ల నాగయ్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : డీపీఎం



పెరటికోళ్లను అందిస్తున్న డీపీఎం సురేంద్రనాథ్ బెనర్జీ

మాడ్గులపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ స్థిర మైన ఆర్థికాభివృద్ధి సాధించాలని డీపీఎం డి.సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా 26 మంది మహిళలకు ఒక్కో యూనిట్‌కు 50 పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్ర శేఖర్, సీసీలు నాగయ్య, సైదులు, స్వాగత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నల్లగొండ పీటీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో...





నల్లగొండ పానగల్ రోడ్డు గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని పలు ఆలయాల్లో నాగుల చవితి వేడుకలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని పానగల్ రోడ్డులో గల రేణుకా ఎల్లమ్మ ఆలయం,పీటి కాలనీలోని వేంకటేశ్వర స్వామి, తులసీ నగర్‌లోని భక్తాంజనేయ, షేర్ బంగ్లాలోని సంతోషిమాత, మర్రిగూడ స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ, పానగల్‌లోని పచ్చల ఛాయ సోమేశ్వరాలయాల్లో పుట్టలకు మహిళా భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గుండపనేని కిషన్ రావు, అలకుంట్ల నాగరత్నంరాజు, నాగేళ్ల నర్సయ్య పాల్గొన్నారు.

ఆలయ భూములకు హద్దులు నిర్ణయిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న డివిజన్ అధికారులు

చిట్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖకు సంబంధించిన భూములకు హద్దులను నిర్ణయిస్తామని ఆశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తిలో దేవాదాయశాఖ, ప్రభుత్వ భూములు ఆక్రమణలు గురవుతున్నాయని ఈనెల 4న పలువురు గ్రామస్తులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ నివేదిక అందించాలని సంబంధిత శాఖ అధికారుల సూచించగా మంగళవారం దేవాదాయశాఖ అధికారులు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ తమశాఖ పరిధిలోని భూములకు హద్దులను నిర్ణయించి కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ భూముల్లో తవ్వకాలు ఇతర పనులు చేపట్టిన వారిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇన్ స్పెక్టర్ వెంట ఈఓ అంబటి నాగిరెడ్డి, పొట్లపల్లి చిన్న స్వామి, పొట్లపల్లి నర్సింహ, చేకూరి గణేష్, బాలగోని బాలరాజు, ముద్దసారి రమణారెడ్డి, ఏర్పుల రాకేష్, యాదగిరి, శ్రీరంగం, సత్తయ్య, విష్ణు, దామోదర్, గణేష్, వెంకన్న,ఉన్నారు.

12న గుండ్రాంపల్లిలో సీపీఎం మండల మహాసభ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాలరూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల మహాసభను ఈనెల 12న చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో జరుగనున్నట్లు ఆపార్టీ జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, రూరల్ మండల కార్యదర్శి అరూరి శ్రీను తెలిపారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం మహాసభకు సంబంధించిన ప్రచార కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు.మహాసభకు పార్టీ కేంద్ర కమిటి సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటి సభ్యుడు తుమ్మల వీరారెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరుకానునన్నట్లు చెప్పారు కార్యక్రమంలో కత్తుల లింగస్వామి, నెలికంటి నర్సింహ, ఎండీ జహంగీర్, కత్తుల యాదయ్య, 'నారాయణరెడ్డి, యాదయ్య, శంభయ్య పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

గట్టుప్పల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):డిసెంబరు 2,3,4 తేదీల్లో మిర్యాలగూడలో జరిగే సీపీఎం బహిరంగ సభను జయ ప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం పార్టీ శ్రేణు లకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం మిర్యాలగూడలో జరిగే బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గట్టుప్పల్ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, టేకుమట్ల కృష్ణ, రావుల నరసింహ పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

మర్రిగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):వరి, పత్తిలో తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. కార్యక్రమంలో సీపీఎ నాంపల్లి, మర్రిగూడ మండల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్టు శివకుమార్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా వినోద్‌నాయక్

దామరచర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):సీపీఎం మండల కార్యదర్శిగా రెండోసారి మాలోతు వినోద్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభలో ఎన్నిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా వినోద్‌నాయక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో శాఖలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాపానాయక్, కోటిరెడ్డి ఎర్రనాయక్, ఖాజా మోహిద్దిన్, దయానంద్, సుభాని, విజయ్, శ్రీను, వెంకటయ్య, పాల్గొన్నారు.

ప్రజలిచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహించాలి

- మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్‌తో మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలిచ్చిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని అప్పుడే నాయకులవుతారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కేసీఆర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

సాగర్ పోలీస్ స్టేషన్ తనిఖీ



సాగర్ హిల్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నాగార్జునసాగర్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు, కేసు ఫైల్స్, సీజ్ చేసిన వాహనాలను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

ధూప, దీప కిట్ల పంపిణీ



కిట్లు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

డిండి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఆలయాలకు మంగళవారం పూజ సామగ్రి కిట్లను అందజేశారు. ఖానాపురం గ్రామంలోని మైసమ్మతల్లి, పెద్దమ్మ తల్లి, టి.గౌరారంలోని వేంకటేశ్వరస్వామి, ఈదమ్మ తల్లి ఆలయాలకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి గోలి రాంరెడ్డి, గ్రామస్తులు మాడ్గుల శ్రీనివాస్, తాటికొండ సైదులు, వినోద్, శ్రీరాములు, రమేష్, పాల్గొన్నారు.

నేటి నుంచి సర్వే

(3పేజీ తరువాయి)

నిర్వహించిన సర్వే వివరాలను నాటి ప్రభుత్వం వెల్లడించలేదు.

2011 ప్రకారం జిల్లా జనాబా వివరాలివి..

మొత్తం ఇళ్ల సంఖ్య :	5,02,000
జనాభా:	34,88,809
హిందువులు:	32,49,231
ఎస్సీలు:	6,37,385
ఎస్టీలు:	3,94,279
ముస్లింలు:	1,88,646
క్రైస్తవులు:	35,025
సిక్కులు:	937
బౌద్ధులు:	241
జైనులు:	259
ఇతరులు:	130
మతం చెప్పనివారు:	14,349

ప్రజలంతా సహకరించాలి

-ఇలా త్రిపాఠి, కలెక్టర్

జిల్లాలో సమగ్ర కుటుంబసర్వేకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎన్యూమరేటర్లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రజలంతా వారి వివరాలను తెలియజేయాలి. ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి వివరాలివ్వాలి. సమయానికి ఇళ్ల వద్దలేకపోతే ఎన్యూమరేటర్లు మరోసారి వస్తారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పారదర్శకంగా వివరాలు తెలియజేయాలి. కేవలం సమాచార నిమిత్తమే ఈ సర్వే నిర్వహిస్తున్న విషయాన్ని ప్రజలంతా గమనించాలి. ఇది జనగణన, కులగణన కాదని గుర్తించాలి.

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND

కుక్కల బెడద తొలిగించాలి

మిర్యాలగూడ, (ఆంధ్రజ్యోతి) : మిర్యాలగూడ పట్టణం లోని అన్నివార్డుల్లో కుక్కల బెడదతో కాలనీ వాసు లు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా సీతారాంపురం, ముత్తిరెడ్డికుంట, సుందర్ నగర్, షాబూనగర్, విద్యానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, చైతన్య నగర్, వాసవీ కాలనీల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడిచేస్తూ గాయ పరుస్తున్నాయి సీతారాంపురంలో ఆదివారం కుక్కలు దాడి చేసి ముగ్గురిని కరిచాయని స్థానికులు తెలిపారు.

ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడదపై ఫిర్యాదులొస్తున్నాయి. కౌన్సిల్ సమావేశంలోనూ చర్చించడంతో పాటు ఉన్నతాధికారులకు పరిస్థితి వివరించినట్లు చెప్పారు. డాగ్ క్యాచింగ్ టీమ్‌ను రంగంలోకి దించనున్నట్లు చెప్పారు నిబంధనల మేరకు వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.